ఐటిడిఎ పిఒ ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సిపిఎం

ఏలూరు అర్బన్: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల ఒకటో తేదీన కెఆర్.పురం ఐటిడిఎ వద్ద ఉదయం పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ బైఠాయించి ధర్నా చేసిన సందర్భంలో ఐటిడిఎ పిఒ సూర్యతేజ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. పిఒ ఇచ్చిన హామీ మేరకు ఎల్‌టిఆర్ భూ సమస్యలపై తహశీల్దార్‌తో భూ సమస్యలపై గిరిజనులతో సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేయాలని, పోడు భూముల హక్కు పత్రాలిచ్చేందుకు గ్రామసభల షెడ్యూల్ ప్రకటించాలని, ఏజెన్సీలో అన్ని శాఖల అధికారులకు ఏజెన్సీ ప్రాంత చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, ఆర్అండ్ఆర్ భూములు గిరిజనేతర భూస్వాముల అక్రమ లీజులు రద్దు చేయాలని, భాషా వాలంటీర్ల వేతనాలు తక్షణం ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై ఆయా శాఖల అధికారులతో చర్చించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని రవి కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 15లోగా తగు చర్యలు తీసుకోకుంటే ఐటిడిఎ కార్యాలయం ముందు వంటావార్పు నిర్వహిస్తామని ప్రకటించారు.

ఎంపిటిసిలకు జీతాల్లేవ్..!

పదవి చేపట్టిన రెండేళ్లవుతున్నా అందని వేతనాలు
రూ.మూడు వేలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
ఇదేం దారుణమంటున్న ఎంపిటిసిలు
పలుచోట్ల బిల్లులు పెట్టినట్లు చెబుతున్నా అందని పరిస్థితి
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 870 మంది ఎంపిటిసిలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక ప్రజాప్రతినిధులైన ఎంపిటిసిలకు గెలిచిన తర్వాత ఇప్పటివరకూ జీతాలివ్వని పరిస్థితి నెలకొంది. దీంతో అసలు ఎంపిటిసిలకు జీతాలిస్తారా?లేదా? అన్న అనుమానం నెలకొంది. పలుమండలాల్లో బిల్లులు పెట్టినట్లు చెబుతున్నా జీతాలు మాత్రం అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో 48 మండలాలుండగా 870 మంది వరకూ ఎంపిటిసిలున్నారు. వీరంతా ఎంతో ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలిచారు. ఎంపిటిసిలకు గ్రామాల్లో సరైన ప్రాధాన్యత లేకుండాపోయింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపిటిసిల పరిస్థితి అయితే వేరేచెప్పనక్కర్లేదు. కనీసం వేతనాలు కూడా ఇవ్వడం లేదు. ఎంపిటిసిలకు నెలకు రూ.మూడు వేలు గౌరవ వేతనంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిటిసిలు పదవీబాధ్యతలు చేపట్టి రెండేళ్ళు గడిచిపోయింది. ఇప్పటి వరకూ జీతాల ఊసే లేదు. దాదాపు ఒక్కో ఎంపిటిసికి వేతనం కింద రూ.70వేలకు పైగా అందాల్సి ఉంది. ప్రజాప్రతినిధులకు నిత్యం అనేకవిధాలుగా ఖర్చులు ఉంటాయి. పెండింగ్ జీతం ఇస్తే ఏదో ఒక ఖర్చుకు వస్తుందన్న భావన ఎంపిటిసిల్లో వ్యక్తమవుతోంది. ఏజెన్సీతోపాటు, ఎస్‌సి, బిసి సామాజిక తరగతికి చెందిన పలువురు ఎంపిటిసిల్లో రోజువారీ పనిచేసుకుని జీవించేవారు సైతం ఉన్నారు. ప్రజాప్రతినిధిగా ఎంపికైన తర్వాత గ్రామాల్లో తిరగడం వంటి అనేక పనులు ఉండటంతో ఖర్చులు తప్పవు. ప్రభుత్వం నుంచి వేతనాల రూపంలో రావాల్సిన సొమ్ములు రాకపోవడంతో చాలామంది ఎంపిటిసిలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపిటిసిల్లో వేతనాల గురించి పట్టించుకునేవారు ఎవరున్నారంటూ చర్చ నడుస్తోంది. ఎంపిటిసిలంతా ధనవంతులు కాదని, రిజర్వేషన్ సీట్లలో రోజువారీ పనిచేసుకునే నాయకులు సైతం ఉన్న పరిస్థితి నెలకొంది. ఎంపిటిసిల జీతాల గురించి ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు. ఎంఎల్ఎలకు, ఎంపీలకు ప్రతినెలా ప్రభుత్వం జీతాలు ఇచ్చేస్తోంది. మరి స్థానిక ప్రజాప్రతినిధులకు మాత్రం ఏళ్లతరబడి జీతాలివ్వడం లేదు. పంచాయతీ సర్పంచులు ఎన్నికై రెండున్నరేళ్ళు దాటిపోగా తొమ్మిది నెలల వేతనంగా ఏలూరు జిల్లాలో దాదాపు రూ.1.50 కోట్లను రెండురోజుల క్రితం ప్రభుత్వం విడుదల చేసింది. ఎంపిటిసిలకు మాత్రం అదికూడా లేకుండా పోయింది. గ్రామాల అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధులదే కీలకపాత్ర. ఎంఎల్ఎలకు, ఎంపిలకు రూ.లక్షల్లో జీతాలు, అలవెన్సులు ఇస్తున్న ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచులకు, ఎంపిటిసిలకు మాత్రం రూ.మూడువేలు వేతనం మాత్రమే ఇస్తోంది. ఆ సొమ్ము కూడా సకాలంలో ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రజలకు నిత్యం దగ్గరగా సర్పంచులు, ఎంపిటిసిలే ఉంటారు. అలాంటి ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పలు చోట్ల ఎంపిటిసిలకు కొన్నినెలల వేతన సొమ్ము జమైనట్లు చెబుతున్నా స్పష్టత లేకుండా పోయింది. ఎంపిటిసిల జీతాల పెండింగ్‌కు సంబంధించి ప్రజాప్రతినిధుల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను తెచ్చి స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచి, ఎంపిటిసిలను ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండానే జరిగిపోతున్నాయి. పంచాయతీలకు వచ్చే ఆర్థికసంఘం నిధులను సైతం కరెంటు బిల్లుల పేరుతో ప్రభుత్వం లాగేసుకుంటుంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి లేకుండాపోయింది. స్థానిక ప్రజాప్రతినిధులకు ఇవ్వాల్సిన జీతాల విషయంలోనూ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఎంపిటిసిలకు పెండింగ్ జీతాలు జమచేయాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

అభివాదం చేస్తున్న నేతలు

బిజెపిని గద్దె దించడమే లక్ష్యం

ఏపి రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సన్నాహక జిల్లా సమావేశంలో వక్తలు
27, 28 తేదీల్లో విజయవాడ మహాధర్నా జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని కార్మిక, కర్షక ఐక్యతతో గద్దె దించుతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు హెచ్చరించారు. ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో రైతు, కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఎపి రైతు, కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా సన్నాహక సమావేశం గురువారం ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయం హాలులో నిర్వహించారు. ఈ సమావేశానికి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రైతుసంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాథరావు, ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ప్రధాని మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దేశ రైతాంగాన్ని మోసగించిందని విమర్శించారు. మరోవైపు దొడ్డిదారిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను అమలు చేస్తూ రైతుల వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయకుండా రైతును వ్యవసాయం నుండి దూరం చేసేందుకు పొమ్మనకుండా పొగబెట్టే చర్యలకు పాల్పడుతోందన్నారు. పసుపు సాగు చేస్తున్న పంటలకు మద్దతు ధర రాక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరువుతో అల్లాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల పాలిట ఉరితాడుగా ఉన్న కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు ఆపాలన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.25 లక్షల కోట్లను మాఫీ చేసిందని, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయినప్పటికీ రైతుల రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతుల ఆత్మహత్యలను ఆపాలని కోరారు. కార్పొరేట్ అనుకూల ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని రద్దుచేసి సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి కార్మిక హక్కులను పునరుద్ధరించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. అధిక ధరలు అరికట్టాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలన్నారు. కేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజా ఉద్యమాలపై నిర్బంధ చర్యలకు పాల్పడుతోందన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.బాషా, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు ప్రకాష్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎఐటియుసి జిల్లా నాయకులు పి.కిష్టయ్య, రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయంకుల లక్ష్మణరావు, రైతు సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.ధనలక్ష్మి, పివైఎల్ జిల్లా కార్యదర్శి సమ్మద్దల సుందరరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి మాట్లాడారు. విజయవాడ మహాధర్నాను విజయవంతం చేసేందుకు కోరుతూ జిల్లావ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాలు వివిధ ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

గిరిజనులపై బైండోవర్ కేసులు అప్రజాస్వామికం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - టి.నరసాపురం

గిరిజనుల పట్ల అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తూ గిరిజనులపై బైండోవర్ కేసులు పెట్టి పేదలను భయభ్రాంతులకు గురి చేయడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. మండలంలోని రామన్నగూడెంలో గురువారం మండల ముఖ్యకార్యకర్తల సమావేశం మడకం సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవి మాట్లాడుతూ మండలంలోని మంగళిమెట్ట భూములు గిరిజనుల, పేదలకు సంబంధించినవేనన్నారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో గిరిజనులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూములపై భూస్వాములు కన్నుపడిందన్నారు. ఆ భూములను అక్రమ సాగుకు కొందరు భూస్వాములు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏళ్ల తరబడి కష్టపడి సాగు చేసుకున్న భూములను భూస్వాములకు కట్టబెట్టేలా రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు రామన్నగూడెం గిరిజన మహిళలను, యువకులను గ్రామంలో బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి గ్రామంలో ఉన్న ఇళ్లన్ని వెతికి కనపడిన వాళ్లను అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. పోలీసుల వ్యవహారం అప్రజాస్వామికంగా ఉందన్నారు. గిరిజనులను బెదిరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామన్నగూడెంలో గిరిజనుల భయభ్రాంతులకు గురి చేయడంతో కాకుండా దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులను అమాయక ప్రజలను చేసి బలవంతంగా వారికి ఎలాంటి వివరాలు చెప్పకుండా పేపర్లపై సంతకాలు చేయించుకోవడం దుర్మార్గమన్నారు. గిరిజనులను వేధిస్తూ వారి చేత వేలిముద్రలు వేయించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చదువురాని అమాయక గిరిజనులను దానిలో ఉన్న వివరాలు చెప్పాల్సిన బాధ్యత తహశీల్దార్‌కు ఉందన్నారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ మాట్లాడుతూ భూస్వాములకు రెవెన్యూ, పోలీస్ మండల అధికారులు కొమ్ము కాయడం సిగ్గుచేటన్నారు. గిరిజన భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ, నాయకులు అనుమోలు మురళీ, మడకం రాము, వరలక్ష్మి రుక్మిణి పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారికి వినతిని అందిస్తున్న నాయకులు

ప్రాజెక్టు భూముల్లో అక్రమ సాగుపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎర్రకాలువ ప్రాజెక్టు మిగులు భూముల్లో అక్రమంగా సాగు చేస్తున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం ప్రభుత్వాధికారులను డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్‌రావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని చక్రదేవరపల్లి, కొంగువారిగూడెంలో ఎర్రకాలువ ప్రాజెక్ట్ రిజర్వాయర్ నిమిత్తం ఎ.పోలవరం, చిన్నవారిగూడెం, తాడువాయి, వేగవరం, చక్రదేవరపల్లి గ్రామాల్లో వందలాది ఎకరాల రైతుల వద్ద నుండి ప్రభుత్వం కొనుగోలు చేసిందని, ఆ భూమికి నష్ట పరిహారం లక్షలాది రూపాయలు పొందిన భూస్వాములు యథావిధిగా పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. దుక్క దున్ని వరి, మొక్కజొన్న, చెరకు, అరటి, పొగాకు తదితర పంటలు వేసి ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టు భూముల్లో పేదలు పశు పోషణ కోసం జాడు, పచ్చగడ్డి వేసుకుంటే వాటిని పశువులతో మేపి మహిళలపై దాడి చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. భూమిలేని పేదలు భూమిలోకి వెళితేనే వారిపై దాడి చేసి కులం పేరుతో దూషించి భయపెట్టారని వాపోయారు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే నేటికీ వారిపై కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. భూస్వాములు పేదలపై పెట్టిన కేసులు నమోదు చేసి పేదలను, మహిళలను నిర్బంధిస్తున్నారని వాపోయారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులు, భూస్వాములు కుమ్మక్కై విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని తెలిపారు. కరెంటు కనెక్షన్లు ఇవ్వకూడదని చట్టం ఉన్నప్పటికీ ప్రాజెక్టు భూముల్లో విద్యుత్ శాఖ అధికారులు అక్రమ పద్ధతిలో కరెంటు కనెక్షన్లు ఇచ్చి వ్యవసాయం చేయడానికి తోడ్పడుతున్నారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయం చేస్తున్న భూస్వాములకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. చట్ట విరుద్ధంగా వ్యవసాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇరిగేషన్ ఎఇ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.సూర్యకిరణ్, భక్తుల వెంకన్న, దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎం.ఆనందరావు, జి.రాంబాబు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ కార్మికులను ఆదుకోండి

ఆయిల్ ఫెడ్ మాజీ ఛైర్మన్ కోఠారుకు వినతి
గుర్తింపు కార్డులిచ్చి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్
ప్రమాద మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వేడుకోలు

ప్రజాశక్తి - పెదవేగి

పామాయిల్ తోటలో పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయిల్ ఫెడ్ మాజీ ఛైర్మన్ కొఠారు రామచంద్రరావుకు సంఘం జిల్లా కమిటీ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పామాయిల్ పంట విస్తారంగా పెరిగిందని, రెండు ప్రయివేటు ఫ్యాక్టరీలు ఒక ప్రభుత్వ ఫ్యాక్టరీ ఉందన్నారు. పామాయిల్ పంట ఎగుమతి, దిగుమతి చేస్తున్న కార్మికులు, గెలలు, మట్టలు నరికే కార్మికుల సంఖ్య సుమారు పదివేల మందికి పైగా ఉన్నారని, వారి సమస్యలు పరిష్కరించడంలో జిల్లా ఉద్యాన వనశాఖ, కార్మిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. గతంలో ఈ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సందర్భంలో ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు రూ.ఐదు లక్షల పరిహారం ఇస్తున్నారని, దానిని రూ.పది లక్షలకు పెంచాలని కోరారు. పామాయిల్ తోటలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం రామచంద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చేస్తున్నపోరాటం అభినందనీయమన్నారు. పామాయిల్ కార్మికుల, రైతుల, కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎంఎల్ఎ దృష్టిలో పెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ అప్పలస్వామి పాల్గొన్నారు.



జెడ్‌పి హైస్కూల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ ఈ తనిఖీలు చేపట్టారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి కేటాయించే సరుకుల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, రోజు వారీ హాజరు తదితర వివరాలను ప్రధానోపాధ్యాయులు లోవ కుమారిని, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వంటశాలలో సరుకులు, వంటకాలను పరిశీలించారు. బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగి పిండి తదితర నిల్వలను పరిశీలించారు. అలాగే తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, ఇతర వసతుల్లో ఎలాంటి ఇబ్బందులూ, నాణ్యతా లోపాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు విజయకష్ణ సూచించారు. అలాగే వినియోగదారుల క్లబ్ ఇప్పటివరకూ ఏర్పాటు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో గుర్తించిన లోపాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని విజయకృష్ణ తెలిపారు.

రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి

క్షేత్రస్థాయి పరిశోధనలతో ఆక్వాకల్చర్ అభివృద్ధి

ప్రజాశక్తి - కాళ్ల(పశ్చిమగోదావరి)

క్షేత్రస్థాయి పరిశోధనలతో ఆక్వాకల్చర్ మరింత అభివృద్ధి చెందుతుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, చేపల శాస్త్రవేత్త మోదడుగు విజయ్ గుప్తా అన్నారు. గురువారం పెదఅమిరంలో రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో ఈ నెల 2, 3, 4 తేదీల్లో అక్వా ఎక్స్ ఇండియా ప్రదర్శనను కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాస్త్రవేత్త విజయ్ గుప్తా మాట్లాడుతూ చేపల పెంపకానికి తక్కువ ఖర్చుతో జంతు మాంసకృత్తులు అందించడం, మానవాళి భవిష్యత్తు ఆహార సంక్షోభాన్ని పరిష్కరించడంలో కీలకమన్నారు. కైకలూరు ఎంఎల్ఎ డి.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు కళ్లల్లో ఆనందం ఉండాలంటే నాణ్యమైన సీడ్, ఫీడ్ ఉపయోగించాలన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం ఒడిదుడులతో సాగుతోందన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టాలన్నారు. సముద్రతీరంలో రొయ్య సాగు చేపట్టి గణనీయమైన ఎగుమతుల్లో రాష్ట్రం దేశంలోనే ప్రధాన భాగంగా ఉందన్నారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ ఆక్వా సాగులో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి దిగుబడి పెంచేందుకు అనుసరించాల్సిన ఆధునిక విధానాలపై ఆక్వా అంతర్జాతీయ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంఎల్‌సి జయ మంగళ వెంకటరమణ మాట్లాడుతూ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రికరణకు సంబంధించిన పరికరాలు ఒక చోట ప్రదర్శనగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, సదస్సు ఆర్గనైజర్ దంతులూరి వేణు, సికెఎన్ మూర్తి, పెనుమత్స విశ్వనాధరాజు, కాలవ వెంకట్రావు, స్టాల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆక్వాఎక్స్ ఇండియా ప్రదర్శనను ప్రారంభిస్తున్న కైకలూరు ఎంఎల్ఎ నాగేశ్వరరావు

హాజరైన పోలీస్ అధికారులు

బెల్ట్ షాపులు, నాటుసారాపై ఉక్కుపాదం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో బెల్ట్ షాపులు, నాటుసారా, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం ఎక్సైజ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో, బేవరీస్ అధికారులతో బెల్ట్ షాపులు, మద్యం అక్రమరవాణా నియంత్రణపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో బెల్ట్ షాపులు నిర్వహించే, అక్రమంగా మద్యం అమ్మేవారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ మద్యం షాపుల్లో అధికశాతం అమ్మకాలు తగ్గిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, ఆయా ప్రదేశాల్లోను బెల్ట్ షాపుల్లోను అక్రమ మద్యం, నాటు సారా వినియోగం పెరిగే అవకాశం ఉందని, వాటి కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతిని, తక్కువ వయసులోనే మరణిస్తారని, వారి కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. మద్యం అక్రమ అమ్మకాలు, నాటుసారా జిల్లాలో లేకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బార్లలో వినియోగించిన ఖరీదైన మద్యం సీసాలను మళ్లీ చీప్‌లిక్కర్‌తో నింపి ఖరీదైన మద్యం పేరుతో బెల్ట్ షాపుల వారు ప్రజలకు అమ్మే అవకాశం ఉందని, అలాంటి వాటిని కనిపెట్టి వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గుడి,క బడులు, నివాసిత ప్రాంతాలకు సమీపంలో మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని, వీరి వల్ల మహిళలకు, పిల్లలకు ఇబ్బంది అని, రక్షణ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాంటి ప్రాంతాల్లో సంబంధిత శాఖల అధికారులు మఫ్టీలో సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించాలని, అనంతరం వాటిలో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాల్లో బెల్ట్ షాపులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ నక్కా సూర్యచంద్రరావు, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి డాక్టర్ ఆర్ఎస్.కుమార్‌ఈశ్వరన్, రాష్ట్ర బేవరీస్ కార్పొరేషన్ ఏలూరు జిల్లా డిపో మేనేజర్ ఆర్.గౌరీశ్వరరావు, ఆర్ఒజి శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాధాకృష్ణ, ఎన్.శ్రీధర్, బి.దుర్గాప్రసాద్, సెబ్ అధికారులు ఎస్.శ్రీనివాసరెడ్డి, జి.అరుణ్‌బాబు, ఎస్‌కె.ధనరాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఎర్రంపల్లిలో స్థల వివాదం

ప్రజాశక్తి - చింతలపూడి

ఇంటి స్థలం వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రంపల్లి గ్రామానికి చెందిన తగరం దేవసహాయానికి, అదే గ్రామానికి చెందిన తగరం వెంకటేశ్వరరావుకు ఇంటి స్థలం విషయంలో పాతకక్షలున్నాయి. 30 ఏళ్ల నుంచి ఆ స్థలంలో దేవసహాయం నివాసముంటున్నాడు. ప్రస్తుతం ఆ స్థలంలో కొత్త ఇంటిని నిర్మించుకునేందుకు దేవసహాయం ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఈ తరుణంలో బుధవారం మధ్యాహ్నం తగరం వెంకటేశ్వరరావు, తగరం రవికుమార్, అతని బంధువు పంతం రవి కలిసి హైదరాబాదు నుంచి కొంతమంది వ్యక్తులను నాలుగు కార్లలో తీసుకొచ్చి బెదిరించాడు. ఈ స్థలం కోర్టులో వివాదం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలో దాడికి యత్నించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని అందరినీ స్టేషన్‌కు తరలించారు. దేవసహాయం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చింతలపూడి ఎస్ఐ కె.ప్రసాద్ తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

జనవరి నాటికి టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు కాలనీలో ఉన్న టిడ్కో గృహ నిర్మాణాలను జనవరి నాటికి పూర్తి చేస్తామని ఎంఎల్‌ఎ వెంకట ప్రతాప్ అప్పారావు, ఎల్‌అండ్‌టి సంస్థ ప్రతినిధి రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎల్‌అండ్‌టి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువారం వారు మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.3.27 లక్షల విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెనుమల్లి శివారు సింగరాయ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయ నిర్మాణానికి శ్రీవాణి ట్రస్ట్ టిటిడి తొలి విడతగా రూ.3.27 లక్షల విరాళంగా అందించారు. ఈ నగదును గురువారం ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు తన చేతుల మీదుగా రామాలయ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సొసైటీ ఛైర్మన్ ముత్యాల రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుళాయిని ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి

తాగునీటి సరఫరాకు కృషి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో తాగునీటి సరఫరా సమృద్ధిగా అందించడానికి కృషి చేస్తున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ 27వ వార్డు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన పబ్లిక్ కుళాయిలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతం నుండి అనేక మంది తాగు నీటిని వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల అవసరాలను గుర్తించి సుమారు రూ.లక్షతో 5 కుళాయిలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సెలర్ నేట్రు సుబ్బలక్ష్మి, అయినాల వెంకటరమణమూర్తి, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కమిషనర్ భవాని ప్రసాద్, ఎఇ సంధ్య, నేకూరి కిషోర్, దొంతు మాధవ్, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో రోగులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల విశ్రాంత న్యాయశాఖ కార్యదర్శి పట్టి వీర వెంకట సత్యనారాయణ శతజయంతి కార్యక్రమాలు బుధవారంతో రెండవ రోజుకు చేరాయి. మూడు రోజులపాటు కొనసాగే కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన బుధవారం ఆయన కుటుంబ సభ్యులు, మానవత భీమడోలు శాఖ అధ్యక్షులు పట్టి సుగుణాకర్ ఆధ్వర్యంలో భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం భీమడోలు శ్రీవెంకటేశ్వర కళాశాల ఆవరణలో కెరియర్ గైడెన్స్ కార్యక్రమాన్ని ఆ సంస్థ జిల్లా విభాగం డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌ఆర్ఐలు, ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టర్లుగా కొనసాగుతున్న గంగిరెడ్డి కృష్ణ హేమంత్, శ్రీకాంత్‌లు విదేశాల్లో విద్యావ్యాసం, ఉపాధి అవకాశాలు, స్థానికంగా వాటిని అన్వయించుకొని పలువురికి ఉద్యోగాలు కల్పించడం, ఇతర అంశాల గురించి వివరించారు. ఈ మేరకు భీమడోలు మానవత శాఖ ద్వారా సంప్రదించే వారికి తమ వంతు సహాయ, సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమడోలు శ్రీవెంకటేశ్వర కళాశాల డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రధాన ఆచార్యులు వంగా నాగేశ్వరరావు, బొమ్మ రవికుమార్‌తో పాటు మానవత భీమడోలు శాఖ సభ్యులు పాల్గొన్నారు.



కెరియర్ గైడెన్స్ నిర్వహిస్తున్న వెంకట ఉమామహేశ్వరరావు, ఎన్‌ఆర్ఐలు

25 మంది విద్యార్థులు రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు సర్ సిఆర్ రెడ్డి పిజి కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేసినట్లేనని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో చాలామంది రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోతున్నారని, కాబట్టి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని విద్యార్థులకు హితవు పలికారు. డాక్టర్ వర్షప్రసాద రావు మాట్లాడుతూ ఆరోగ్యవంతులు రక్తదానం చేయడం వలన ఎలాంటి అనారోగ్యాలు రావని, కాబట్టి ప్రతిఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెవి.రామరాజు, డైరెక్టర్ విఆర్‌ఎస్ బాబు, కెబి.రావు, డి.రమాదేవి, కెవి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కైకరం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఉంగుటూరు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏలూరులో జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో జరిగిన జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలలో అండర్-17 విభాగంలో కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్విమ్మింగ్ ఫ్రీ స్టైల్ కేటగిరిలో రాగోలు లక్ష్మీ శ్రీ చైతన్యకుమార్ ప్రథమ స్థానం, బ్యాక్ స్ట్రోక్ కేటగిరీలో రాగోలు భరత్ ప్రథమ స్థానం, కనమటి రాకేష్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయులు జి.నాగసుధ, పాపాయమ్మలను మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

స్విమ్మింగ్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

'జగన్ హయాంలో రాష్ట్రానికి భవిష్యత్ లేదు'

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రానికి భవిష్యత్తు అనేది లేకుండా చేసిన ఘనత పిచ్చి తుగ్లక్ సైకో జగన్‌రెడ్డి దేనని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ముసునూరు మండలం, గుడిపాడు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి, గ్రామంలోని సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి రాజధాని నగరాన్ని తాను నిర్మిస్తానని, మద్యం నిషేధం అమలుపరిచి, మద్యం తయారు చేసినా, అమ్మినా ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించేలా చట్టాన్ని మారుస్తానని, అధికారంలోకి వచ్చిన వారం రోజుల లోపు సిపిఎస్ రద్దు చేస్తానని హామీలు గుప్పించిన జగన్‌రెడ్డి రాష్ట్ర భవిష్యత్తును అంధకారం చేశాడన్నారు. నేడు ఉద్యోగులకు ప్రతినెల వారం గడిచిన తర్వాత గాని ఒక్కొక్కరికి జీతాలు పడని పరిస్థితి నెలకొందని ముద్దరబోయిన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ వంచించని మనిషి లేడని ప్రతి ఒక్కరిని జగన్ మోసపూరిత మాటలతో వంచించాడన్నారు. అధికారంలోకి చంద్రబాబు వస్తే పోలవరం పూర్తి చేయడంతో పాటు, చింతలపూడి ఎత్తిపోతల పథకం చేపట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తారని తెలిపారు. పట్టిసీమ చేపట్టినప్పుడు వృధా అన్న వైసిపి నాయకులకు నేడు అదే పట్టిసీమ గతయిందన్నారు. అయినా పంట పొలాలకు సరైన సమయంలో సాగునీరు అందివ్వక ఎండిపోతుంటే భారీ నీటిపారుదల శాఖా మంత్రి అంబటి ఫంక్షన్లకు వెళ్లడం మినహా సాధించింది ఏమిటని ఎద్దేవా చేశారు. సిగ్గులేని అధికార పార్టీ నాయకులు ప్రతిపక్షాల మీద విమర్శలు మాని ప్రజలకు సుపరిపాలనందించడంపై దృష్టి పెడితే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గద్దే రఘు బాబు, కొలి గంగారామ్, మందలపు ధర్మరాజు, కందుల పిచ్చయ్య, మసిముక్కు సుబ్బారావు పాల్గొన్నారు.



గుడిపాడులో కార్యక్రమంలో పాల్గొన్న ముద్రబోయిన, టిడిపి నాయకులు

నేరాలు - ఘోరాలు

కత్తులతో బెదిరించి పందెం కోళ్లు చోరీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని రావిచెర్ల గ్రామంలో బుధవారం అర్ధరాత్రి కత్తులతో బెదిరించి దుండగులు పందెం కోడిపుంజులను చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు మెతుకుమిల్లి శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు అందించిన వివరాల మేరకు అర్ధరాత్రి నలుగురు దుండగులు కత్తులతో వచ్చి చంపేస్తామని బెదిరించి 11 పందెం కోడిపుంజులను చోరీ చేసినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు నాలుగు లక్షల రూపాయలు ఉంటుందన్నారు. రూరల్ పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగుమందు ప్రభావంతో కూలీ మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిత్తపూరు గ్రామానికి చెందిన రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కొడవటి ఇశ్రాయేలు(35) అనే కూలీ గురువారం మృతి చెందాడు. స్థానిక చాట్రాయి పోలీస్ స్టేషన్ ఎస్ఐ కెసిహెచ్.స్వామి తెలిపిన వివరాల ప్రకారం చిత్తపూరు గ్రామానికి చెందిన ఇశ్రాయేలు రోజువారి కూలీ పంట పొలాలకు, పత్తి పైరులకు పురుగుమందు పిచికారీ చేస్తాడని యథావిధిగా గురువారం ఒక రైతు పత్తి పంటకు పురుగుమందు పిసికారీ చేయటానికి వెళ్లి ఆ మందు వాసన పీల్చడం వలన స్పృహ కోల్పోయి కోమాలోకి వెళ్లి మరణించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించినట్లు తెలియజేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు.

మృతి చెందిన ఇశ్రాయేలు

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ యం.కుటుంబరావు తెలిపారు. బుధవారం రాత్రి సమయంలో సూరేపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తూండగా ఓ మహిళ క్యారీ బ్యాగులో అక్రమ మద్యం సీసాలను పట్టుకుని తీసుకువెళుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆమెను వివరాల అడగగా అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్నట్లు ఆమె తెలపడంతో, ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ఏలూరు స్పోర్ట్స్ : రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దెందులూరు మండలం అప్పారావు పాలెంకు చెందిన లంకపల్లి వెంకటేశ్వరరావు(61) ఈనెల ఒకటో తేదీ సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై ఏలూరు వచ్చి పనులు చూసుకున్న అనంతరం ఇంటికి తిరిగి వెళుతుండగా రైల్వేస్టేషన్ సమీపంలో ఇతన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రున్ని తొలుత ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై టూ టౌన్ సిఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఐ శుభ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాంబాబు

అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రతి ఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని సిజిజిబి విజిలెన్స్ అధికారి ఇ.రాంబాబు తెలిపారు. మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ అందిస్తున్న సేవలను ఖాతాదారులకు తెలిపారు. సమాజంలో బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడం కూడా అవినీతిగానే భావించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సిజిజిబి ప్రధాన కార్యాలయ విజిలెన్స్ అధికారి విజయ్ కుమార్, రీజనల్ మేనేజర్ మల్లేశ్వరరావు, మేనేజర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ముదినేపల్లి : మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన గురువారం నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అనంత పద్మనాభం సూచనలు మేరకు ప్రతి సోమవారం, గురువారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు డిజిటల్ సిఆర్ పి.గౌతంకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. వినియోగదారులు ఉత్పత్తులను కొనుగోలు చేశారని, మంచి స్పందన వస్తోందని గౌతమ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి నారాయణ పాల్గొన్నారు.

స్నాన ఘాట్‌ల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

ఈనెల 14వ తేదీ నుంచి కార్తీకమాసం మొదలవుతున్న సందర్భంగా మండలంలోని పరిసర గోదావరి స్నాన ఘాట్‌లను పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ కార్తీకమాసంలో ప్రజలు పెద్ద ఎత్తున గోదావరి నదికి వెళ్ళి పుణ్య స్థానాలు ఆచరిస్తారని, వారి భద్రత దృశ్య రేవులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పాత పోలవరం, పెద్ద రామాలయం వీధి, చిన్న రామాలయం వీధి, ఆంజనేయస్వామి గుడి వీధి, నూతన గూడెం, కృష్ణారావుపేట, బంగారంపేట, పాత పట్టిసీమ, కొత్త పట్టిసీమ, గూటాల గ్రామాలలో గల స్థానాల రేవులను పరిశీలించి, భక్తులకు స్నాన మాచరించేందుకు అణువుగా ఉండే రేవులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పంచాయతీ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఎంపిక చేసిన రేవుల వద్ద ప్రజలు స్నానమాచరించే విధంగా ఏర్పాట్లు, తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్నానాలు చేసేందుకు అణువుగా లేని రేవుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, తగు జాగ్రత్తలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న రేవులు వద్ద అయ్యప్ప మాలదారన చేసిన స్వాములు, భక్తులు, ప్రజలు స్నానాలు చేసేందుకు వెళ్ళవద్దని సూచించారు. స్నానం చేసేందుకు అనువుగా ఉన్న రేవులు వద్ద తగు జాగ్రత్తలు తీసుకుంటూ స్నానాలు చెయ్యాలని ఎస్ఐ కోరారు.

పట్టిసీమ వద్ద స్నాన ఘాట్‌లను పరిశీలిస్తున్న ఎస్ఐ పవన్ కుమార్

ఒప్పందం ప్రకారమే నియామకం

ప్రజాశక్తి - ముసునూరు

ఎన్నికల సమయంలో ఒప్పందం ప్రకారమే ముసునూరు మండల పరిషత్ అధ్యక్షురాలు పదవి మొదటి రెండు సంవత్సరాలు కాట్రేనిపాడు ఎంపిటిసి రాపర్ల కృష్ణకుమారి సుబ్బరావుకు, అదేవిధంగా తరువాత మూడు సంవత్సరాలు రమణక్కపేట ఎంపిటిసి కోండా దుర్గాభవానీ వెంకట్రావ్‌కు కేటాయించడం జరిగిందని వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం విలేఖర్ల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ పద్ధతి ప్రకారం కృష్ణకుమారి మొదటి రెండు సంవత్సరాలు పదవి చేపట్టడం జరిగిందన్నారు. ఆమె గతనెలలో అధికారపూర్వకంగా కలెక్టర్ ఆధ్వర్యంలో రాజీనామా పత్రంపై సంతకం పెట్టి కలెక్టర్ కార్యాలయంలో అందజేయడం జరిగిందన్నారు. అనంతరం అధికారపూర్వకంగా రెండో ఎంపిపిగా రమణక్కపేట ఎంపిటిసి దుర్గాభవానీ వెంకట్రావ్‌కు కొనసాగుతారన్నారు. ఎంపిటిసిల ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ఎంపిపి పదవి ఎన్నిక నిర్వహించే వరకు, తాత్కాలిక ఎంపిపిగా వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన నియమించారని, దీనిని టిడిపి నాయకులు రాదాంతం చేసి పలు పత్రికల్లో పలు అభిప్రాయాలతో ప్రచురించరాదని తెలియజేశారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి వరికూటి ప్రతాప్, తాత్కాలిక ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగాధరరావు, ఎంపిటిసి కోండా దుర్గాభవానీ, ఎంపిటిసి పుచ్చకాయల వెంకటేశ్వరరావు, చింతలవల్లి సర్పంచి పిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఓ అద్దయ్య

మద్ది కార్తీక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

జంగారెడ్డిగూడెం : మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించనున్న కార్తీకమాస ఉత్సవాలను ఎటువంటి అవరోధాలు లేకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని ఆర్‌డిఒ కె.అద్దయ్య ప్రభుత్వశాఖ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో అద్దయ్య అధ్యక్షతన మద్ది ఆంజనేయస్వామి ఆలయ కార్తీకమాస ఉత్సవాల నిర్వహణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాస ఉత్సవాలు ప్రారంభం నాటి నుండి ముగింపు వరకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా నియంత్రించాలని పోలీస్‌శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మద్ది ఆలయ ఇఒ కొండలరావు, పోలీస్ రెవెన్యూ విద్యుత్, వైద్య ఆరోగ్య, తదితర ప్రభుత్వ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాజానగరం, కామయ్యకుంట గ్రామాల్లో నూతన రైతు భరోసా, సచివాలయ భవనాలను ఎంఎల్ఎ తెల్లం బాలరాజు , ఐటిడిఎ పిఒ సూర్య తేజ గురువారం ప్రారంభించారు. సచివాలయ భవనాన్ని రూ.42 లక్షలతో, రైతు భరోసా కేంద్రాలను రూ.21.80 లక్షలతో నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి మొడియం రామతులసి, మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, వైస్ ఎంపిపిలు, కుక్కల వరలక్ష్మి, గుగ్గులోతు మోహన్ రావు, సొసైటీ అధ్యక్షులు అరేటి సత్యనారాయణ, స్థానిక సర్పంచి కుంజా దుర్గమ్మ, స్థానిక ఎంపిటిసి, స్థానిక నాయకులు కుంజా ప్రసాద్, సచివాలయం కన్వీనర్లు, అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ, సూర్యతేజ

కైకరంలో యర్రం నాయుడు వర్ధంతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మాజీ మంత్రి, టిడిపి నేత కీర్తిశేషులు యర్రం నాయుడు 11వ వర్ధంతి కైకరంలో గురువారం నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ ఏలూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, ఎంపిటిసి-3 సభ్యురాలు చెన్ను సత్యవేణి, సర్పంచి సలగాల గోపి, మండల అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, కార్యదర్శి నల్లా ఆనంద్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు యాళ్ల సుజీవరావు, అనుబంధ సంఘాల నాయకులు యెగ్గిన శ్యామల, సిరిబత్తుల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

CHANGE OF NAME

I BEVARA MURALI S/O. BEVARA YERRAYA D.NO. 17-2-14/3, SIVALYAM STREET RUSTUMBADA, NARASAPURAM -534275, W.G.DT. A.P. HAVE CHANGED MY NAME FROM BEVARA MURALIDHAR (OLD NAME) TO BEVARA MURALI (NEW NAME) HENCE AFTER ALL MY DOCUMENTS AND CORRESPONDENCE WILL BE CONTINUE WITH MY NEW NAME BEVARA MURALI.

NAME CHANGE

నా యొక్క పాత పేరు కాళిదాసు నిర్మల, తండ్రి: కాళిదాసు రవి ది. 11-11-2016న ఇస్లాం మతం తీసుకుని పేరు మార్చుకున్నది. పేరు మార్చుకున్న పేరు SHAIK NASEEMA, W/o. Shaik Subhan. ఇక నుండి **SHAIK NASEEMA** గా పిలువబడుతుంది.

SHAIK NASEEMA
Door No. 26-2-30
Ashok Nagar, Venkataraopeta
Eluru Dist.,

In the Court of the Hon'ble Principal District Judge at Eluru, W.G.Dist.
M.V.O.P. No. 413/23

Between:
Battula Durgamma and others ***...Petitioners***
AND
Kondeti Praveen and anothers ***...Respondents***

R-2: G.Narasimha Swamy, S/o. Rambabu, Owner of Motor Cycle bearing No. AP 37 BL 5390, R/o. H/No. 4-165/B, Venkatayyapalem, Achanta Vemavaram Village, Achanta Mandal, W.G.Dist.,

మీరు పై తెలిపిన M.V.O.P 413/23 లో పై తెలిపిన 2వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన Principal Dist. Judge, Eluru వారి కోర్టు వారి యొక్క ఉత్తరువు ప్రకారం మీరు **నవంబర్ 15వ తేదీన 2023వ సం॥రం ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 15-11-2023

YELETI MANOHARAM, Advocate
Eluru, Cell: 9849234161

In the Court of the Hon'ble Principal District Judge at Eluru, W.G.Dist.
M.V.O.P. No. 412/23

Between:
Battula Sunil Kumar ***...Petitioner***
AND
Kondeti Praveen and anothers ***...Respondents***

R-2: G.Narasimha Swamy, S/o. Rambabu, Owner of Motor Cycle bearing No. AP 37 BL 5390, R/o. H/No. 4-165/B, Venkatayyapalem, Achanta Vemavaram Village, Achanta Mandal, W.G.Dist.,

మీరు పై తెలిపిన M.V.O.P 412/23 లో పై తెలిపిన 2వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన Principal Dist. Judge, Eluru వారి కోర్టు వారి యొక్క ఉత్తరువు ప్రకారం మీరు **నవంబర్ 15వ తేదీన 2023వ సం॥రం ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది: 15-11-2023

YELETI MANOHARAM, Advocate
Eluru, Cell: 9849234161

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P. 28/2021 in O.S. 289/2012

Between:
శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం, పెదనింద్రకొలను, Rep. by its E.O. ***-పిటీషనరు/వాది/DHR***
AND
పసుపులేటి భీమశంకరం, S/o. వెంకటరత్నం, డో.నెం. 2-86, పెదనింద్రకొలను (V), నిడమర్రు (M), ఏలూరు జిల్లా. ***-రెస్పాండెంటు/ప్రతివాది/JDR***

పై నెంబరు E.P. గ్రంథం వాది/DHR తమకు రావలసిన డిక్రీ బాకీ వసూలు మీపైన తెచ్చి మీకు U/Order 21, Rule 22 CPC ప్రకారం కోర్టు నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకొనకుండా Avoid చేయుచున్నందున మీకు నోటీసులు Substitute Service ద్వారా అమలు చేయుటకు శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు యిచ్చి పై నెంబరు E.P. 28/2021 ది. 14-11-2023వ తేదీకి వాయిదా వేసియున్నారు.

కావున మీరు **ది. 14-11-2023వ తేదీన పైన తెల్పిన శ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥ల** లగాయితు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై పై నెంబరు E.P. గ్రంథంలో మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల పై నెంబరు E.P. గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పి.వి.వి.సత్యనారాయణ
అడ్వకేట్, తాడేపల్లిగూడెం
సెల్:9346913014

తాడేపల్లిగూడెం
28-10-2023

MUNICIPAL CORPORATION, ELURU

TENDER NOTICE No: 248/GEN/2023-24, Dated:02-11-2023

The Commissioner, Municipal Corporation, Eluru inviting tenders from the interested, eligible Contractors for **"Supply of 3 No of Hire Car to the Officials in Eluru Municipal Corporation"** with an amount of Rs. **12.60** Lakhs.

Last date for receipt of application towards tender schedule is 15-11-2023. Last date of receipt of tenders is 16-11-2023. Further details can be known from this office detailed tender notice or contact Commissioner, Municipal Corporation, Eluru, West Godavari District (Phone/ Fax: 08812-232101).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU